క్లుప్తంగా

'చదవడం మాకిష్టం'



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదవేగి : విద్యార్థుల భవిష్యత్తుకై చక్కటి పునాదులు వేసేందుకు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన చదవడం మాకిష్టం కార్యక్రమంపై విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారని పెదవేగి గ్రంథపాలకుడు టి అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పెదవేగి శాఖ గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుపై ఆసక్తి కలగాలంటే తరచుగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని చెప్పారు. తరచుగా ఇష్టమైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే, ఇతర పాఠ్యపుస్తకాలపై మక్కువ ఏర్పడుతుందని అన్నారు. ఇలా క్రమేపీ విద్యపై ఆసక్తి పెరిగి చక్కటి మార్కులు సాధించవచ్చని ఆయన తెలిపారు.

బంగారు పుష్పం సమర్పణ



బంగారు పుష్పాన్ని అందిస్తున్న సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఓ భక్తురాలు ప్రత్యేక బంగారు పుష్పాన్ని ఆదివారం బహూకరించారు. కృష్ణా జిల్లాకు చెందిన కోనకళ్ల సీతామహాలక్ష్మీ తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ఐదు గ్రాముల బంగారు పుష్పాన్ని బహూకరించారు. తొలుత ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అనంతరం బంగారు పుష్పాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పెద్దలు నీలంశెట్టి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివార్లకు త్రిశూల, చక్రస్నానం



భీమడోలు గోదావరి కాల్వలో స్వామివార్లకు పుణ్యస్నానాలు ఆచరిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలులో వేంచేసియున్న శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామివార్ల వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం స్వామివార్లకు త్రిశూల, శ్రీచక్రస్నానం మహోత్సవం వేడుకగా శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు త్రిశూలేశ్వరుడు, సుదర్శనుడు విగ్రహాలను భక్తులతో కలిసి మేళ తాళాల నడుమ ఊరేగింపుగా కాలువలో పుణ్యస్నానాలను ఆచరించారు. ఆలయ పూజారులు కాళ్లకూరి ఉమాశంకర శర్మ, శివాచార్యులు, బృందావనం శేష భట్టాచార్యులు, భక్తులు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పెదవేగి : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెదవేగి మండలం పినకడిమి, రాయన్నపాలెం, కొండలరావుపాలెం గ్రామాల్లో ప్రత్యేక భద్రతా బలగాలతో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొనాలని, ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ జరగాలని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచనల మేరకు, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

జగన్‌కు అండగా నిలవాలి

చింతలపూడి: ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపురం, పోతునూరు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం బూత్ కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మవద్దని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

మహిళల ప్రగతికి జగనన్న ఆసరా

- డ్వాక్రా సంఘాలను మోసం చేసిన చంద్రబాబు
- వాయిదాలు చెల్లించక అప్పులపాలైన మహిళలు
- సీఎం జగన్ హయాంలో మహారాణుల్లా అతివలు
- వైఎస్సార్ ఆసరాతో మహిళలకు భరోసా



ఆసరా కార్యక్రమంలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)

దెందులూరు: పొదుపు ఉద్యమం.. మహిళల్లో క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనం. రూపాయి రూపాయి కూడబెట్టి దాన్ని పరపతిగా చూపించి తీసుకున్న కొద్దిపాటి అప్పులతో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించారు. తమ కాళ్ల మీద తాము నిలబడటమే కాదు కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఉవ్వెత్తిన ఎగసిన పొదుపు ఉద్యమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పావలా వడ్డీ పథకంతో ఊతమిచ్చారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయాలని సంకల్పించారు. ఆ దిశగా కృషి చేశారు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన డ్వాక్రా ఉద్యమం చంద్రబాబు హయాంలో కునారిల్లిపోయింది. ఈ పరిస్థితికి కారణం 2014ఎన్నికల్లో చంద్రబాబుఇచ్చిన డ్వాక్రా రుణ మాఫీయే. ఈ హామీని చంద్రబాబు నెరవేర్చకపోవడంతో 5 ఏళ్లల్లో ఎన్నో వేల కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. బాబుఇచ్చిన హామీ పుణ్య మా అంటూ వాయిదాలు కట్టని పాపానికి డ్వాక్రా అక్కచెల్లెమ్మలు దీనస్థితి ఎదుర్కొన్నారు. చంద్ర బాబు మాటలు విని సకాలంలో వాయిదాలు కట్టకపోవడంతో జిల్లాలో అనేక వేలమంది సభ్యు లు ఆర్థికంగా సతమతమయ్యారు. 2018–19 నాటికి పూర్తిగా డిఫాల్ట్ లిస్టులో చేరిన సంఘాలు అనేకం ఉన్నా యి. బకాయిలకోసం కోర్టు ద్వారా నోటీసులు ఇవ్వడమే కాదు, ఆ కుటుంబాల్లోని పిల్లలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలు మంజూరు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నింది. ఆదరణ పనిముట్లు సైతం ఇవ్వకుండా నిలుపుదల చేశా రు. ఒక రకంగా చెప్పాలంటే ఆ కుటుంబాలను వెలివేసినట్లుగా చేసింది.

మండలాల వారీగా నాలుగు విడతల్లో జమ చేసిన ఆసరా సొమ్ములు

మండలం	గ్రూపులు	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో..)
దెందులూరు	1457	14165	69 కోట్ల 37లక్షలు
పెదవేగి	1872	18676	70 కోట్ల30 లక్షలు
పెదపాడు	1478	14260	54 కోట్ల 44లక్షలు
ఏలూరురూరల్	1813	17634	53 కోట్ల 38 లక్షలు

ఆసరాతో సీఎం జగన్ భరోసా

అక్కచెల్లెమ్మల దుస్థితిని గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో మహిళలకు ఆసరాగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో స్వయం సహాయక బృందాలు చెల్లించాల్సిన బకాయిలను సైతం వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్ సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేసి, వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18750 చొప్పున మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలిచారు. అతివలను అడుగడుగునా బాబు నయవంచనకు గురి చేయగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఆర్థిక అభివృద్ధి కోసమే నిరంతరం కృషి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి



చంద్రబాబు ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చారు. వాటిని అమలు చేయలేదు. దీంతో డ్వాక్రా మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు స్వర్ణయుగంగా మారింది. ప్రతి సంక్షేమ పథకం లబ్ధిని మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేయడంతో అక్కచెల్లెమ్మలు ఆర్థికాభివృద్ధి చెందారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా రుణాలను సైతం సీఎం జగన్ ఆసరా పథకం పేరిట మాఫీ చేసి మహిళల అభివృద్ధికి పాటుపడ్డారు.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కాం



వైఎస్సార్ ఆసరా ద్వారా నాకు నాలుగు విడతలుగా రూ.2లక్షలు వచ్చింది. ఆ డబ్బులతో కిరాణా కొట్టు పెట్టుకున్నాను. దీనిపై వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడు, వాదోడు గా నిలిచాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల లబ్ధితో మా కుటుంబం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కింది.

– గుడిపూడి చంటి, ప్రియాంక గ్రామ సంఘం, అప్పారావుపాలెం

పండ్ల షాపుతో ఉపాధి



నాకు వైఎస్సార్ ఆసరా పథకం పేరిట వచ్చిన లక్ష రూపాయలతో పండ్ల షాపు పెట్టుకుని ఉపా .ది పొందుతున్నాను. గ్రామంలో పండ్ల కొనుగోలును అలవాటు చేశాను. మా ఊరి వాళ్లు పట్టణాలకు వెళ్లి తెచ్చుకునే అవసరం లేకుండా పండ్ల షాపును గ్రామంలో ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఎంతో అభినందించారు.

– తలారి వసంతలక్ష్మి, అభయ గ్రూపు, కొత్తముప్పర్రు

మా జీవితాలకు భద్రత కల్పించారు



నాకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ. లక్షా 50 వేలు వచ్చింది. ఆ డబ్బులతో మేకలు కొనుగోలు చేశా. వాటిని మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పేదల బతుకులకు భద్రత, భవిష్యత్తు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– బడికొట్టి వెంకటేశ్వరమ్మ, వేళంగిని గ్రూపు, కవ్వగుంట

రాచూరులో వైఎస్సార్ సీపీ ప్రచారం



రాచూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఉంగుటూరు: రాచూరు గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబును, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని వైస్ ఎంపీపీ సింగిరెడ్డి సూర్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతోపాటు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, కన్వీనర్లు చింతపల్లి వాసు, గంటా సురేష్, నాయకులు చింతపల్లి మంగారెడ్డి, చింతపల్లి సుబ్బారెడ్డి, ముంగరరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఉంగుటూరు: విశ్వబ్రాహ్మణుల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుపోజు బ్రహ్మం, గౌరవ అధ్యక్షుడిగా కవులూరి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా యర్రోజు సుబ్బయ్యాచార్యులు, కోశాధికారిగా పులూర్ల సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బి. శ్రీనివాసాచార్యులు మరో 19 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా సంఘం అధ్యక్షుడు నక్కా చైతన్య శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శివశ్రీ, కోశాధికారి మంగండ శివగణేష్, వర్కింగ్ సెక్రటరీ యండపల్లి పాండురంగాచార్యులు, రాష్ట్ర సంఘం కార్యదర్శి పెసరగంటి త్రిమూర్తులు, కనకాచార్యులు, పోతురాజు, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యం



ఐఐటీ ర్యాంకర్ యశ్వంత్ నాయుడు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని పలువురు మానవత ప్రతినిధులు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు గ్రామంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పలు సేవా కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి అడబాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మండల చైర్మన్ గుల్ల నూకరాజు, జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల కన్వీనర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ మానవత సంస్థ విస్తరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. గ్రామానికి చెందిన వెజ్జు నాగేశ్వరరావు కుమారుడు యశ్వంత్ నాయుడు ఐఐటీలో ఉత్తమ ర్యాంకు సాధించి తిరుపతి ఐఐటీలో సీటు పొందడంతో విద్యార్థిని, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా మానవత భవనం నిర్మాణంలో అంకితభావంతో పని చేసిన బొమ్ము గాంధీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు, మండల కోశాధికారి గుల్ల అప్పారావు, కోచైర్మన్ రుద్రపాక ప్రసాద్, జాయింట్ కార్యదర్శి అల్లాడ ప్రసాద్, పూర్వపు అధ్యక్షుడు గంధం వెంకట్రావు, ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్, టీచర్ మండే సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పరామర్శలు




కవ్వగుంటలో మాజీ సర్పంచ్ మద్దాల నాగయ్యను పరామర్శిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండల వ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలను, అలాగే ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. శనివారం రాత్రి రాయన్నపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలగాని సత్యనారాయణ భార్య రమణని ఎమ్మెల్యే పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యారావుపేటలో అంగలకుదురు లక్ష్మీనారాయణ, ముండూరు గ్రామానికి చెందిన చీమకుర్తి మాధవరావు, బట్టు రవికుమార్, చక్రాయగూడెం గ్రామానికి చెందిన రాజబోయిన పారిజాతం, బోట్ల సత్యవతి, వేగివాడ గ్రామానికి చెందిన జుజ్జూరి సత్యవతి, కవ్వగుంట గ్రామంలో అద్దలూరు నాగరాజు, మేక నాగరాజు, మద్దాల వెంకమ్మ ఇటీవల మరణించగా వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. లక్ష్మీపురంలో పెదవేగిలో గ్రామంలో పలువురు పరామర్శించి అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

నానిని కలిసిన పంతగాని వెంకన్న

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్ బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లమిల్లి ఏసుపాదం, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో దివ్య పూజాబలిని సమర్పిస్తున్న విచారణ కర్త ఫాదర్ షింటో



భీమడోలులో పురవీధుల్లో ఈత మట్టలతో నినాదాలు చేస్తున్న క్రైస్తవులు

భీమడోలు: క్రైస్తవులు మ్రానికొమ్మల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రభువైన ఏసుక్రీస్తు పునరుత్థానం(ఈస్టర్) దినానికి ముందు వచ్చే ఆదివారంను మ్రానికొమ్మల ఆదివారం(మట్టల ఆదివారం)గా జరుపుకుంటారు. దావీదు కుమారునికి జయం జయం, యూదుల రాజా జయం, హోసన్న హోసన్నా అంటూ వారంతా చేసిన గీతాలు మార్మోగాయి. సుందరంగా అలంకరింపబడిన కొబ్బరి, ఈత మట్టలను చేత పట్టుకుని క్రైస్తవ గీతాలాపన చేస్తూ గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, సూరప్పగూడెం, లంక గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్ఐ, సీబీసీఎన్‌సీ, రక్షణసైన్యం తదితర క్రైస్తవ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఫాదర్ షింటో విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏసుక్రీస్తు మానవుల పాపాల పరిహారం కోసం శిలువ వేయబడ్డారని, ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ మనమంతా సత్ప్రవర్తన, దయ గుణంతో తోటివారిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు నెల్సన్, జోషి, జింటో, కన్య స్త్రీలు, విన్సెంట్ డీపాల్ సభ్యులు, జీసస్ యూత్, దళ సభ్యులు, పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

పెదవేగి : తపస్సు కాలంలో పవిత్ర మాని కొమ్మల ఆదివారంను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామ గ్రామానా ఆయా దేవాలయాల నుంచి విశ్వాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వాసులు ఆశీర్వదించిన కొబ్బరి తాళ పత్రాలతో, ఈత ఆకులకు పూలు గుచ్చి, క్రీస్తు రాజుకు జై, యూదుల రాజుకు జై, దావిదు రాజు జై అంటూ పురవీధుల్లో స్తుతిగానాలు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విచారణ పరిధిలోని గ్రామాల విశ్వాసులు, సంఘస్తులు, దీక్షాపరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు

గ్రామాల్లో ర్యాలీ

దెందులూరు: గ్రామగ్రామాన క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం అన్ని గ్రామాల్లో అన్ని క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి కోర్ ఆఫీసర్ రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ సుబ్బారావు, దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా, నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ గ్జేవియర్, పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ డేవిడ్, కొవ్వలి బేథేలు చర్చి ఫాదర్ విలియమ్స్, దెందులూరు మన్నా చర్చి ఫాస్టర్ బెంజిమన్స్‌ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలకు పుష్పాలు గుచ్చి హోసన్న జయము జయము అంటూ వీధుల్లో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు.



నడిపల్లి, విజయరాయి గ్రామాల్లో ఈత మట్టలతో విశ్వాసులు ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి శ్రీరాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుముపై రూ 41,311, విరాళాల వలన రూ 26,353, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.28,215, ఫొటోల విక్రయం ద్వారా రూ 3,825 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి కల్యాణం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా శనివారం రాత్రి జరిగింది. ఈనెల 22వ తేదీ నుంచి దివ్య కల్యాణోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ పూజారులు లంకా శ్రీనివాస్ శర్మ, లంకా శివకుమార్ శర్మ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ తంతు గావించారు.

పరిమితికి మించి నగదును తీసుకెళ్లరాదు



భీమడోలు రైల్వేగేటు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి



పెదవేగి గ్రామస్తులకు ఎన్నికల నిబంధనల గురించి వివరిస్తున్న సీఐ, ఎస్సైలు

ఉంగుటూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు వాహనదారులు పరిమితికి మించి నగదును తీసుకవెళ్లరాదని ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగు అధికారి ఖాజావల్లీ తెలిపారు. భీమడోలు చెక్‌పోస్టు వద్ద ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగ అధికారి ఖాజావల్లీ తనిఖీ బృందాల పనితీరును పరిశీలించారు. సుమారు వందవరకు ద్విచక్రవాహనాలను, చిన్నకార్లను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆర్‌వో ఖాజావల్లీ మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట తీసుకువెళ్లే నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. తనికీ అధికారులు కోరితే చూపించాలన్నారు. కార్యక్రమంలో భీమడోలు తహసీల్దార్ వరాహాలయ్య, భీమడోలు సీఐ బీబీ రవికుమార్, ఎస్సై సుధాకర్, చెక్‌పోస్టు బాధ్యులు భీమడోలు సీఎస్ జీటీపీ మాధవరావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

పెదవేగి : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పెదవేగి ఎస్సై వి రాజేంద్ర ప్రసాద్ కోరారు. శనివారం రాత్రి మండలంలోని కూచింపూడి, పెదవేగి గ్రామాల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్నికల నిబంధనలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను అనుసరించి మండల వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో రాజకీయ పార్టీలపై తప్పుడు పోస్టులు పెట్టినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎస్సైలు, ఆయా గ్రామాలకు చెందిన యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

భీమడోలు: ఎన్నికల కోడ్ అమలులో నేపథ్యంలో వాహనాల్లో నగదును తరలించే సమయంలో విధిగా పత్రాలు ఉండాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే స్వాధీనం చేసుకుంటామని ఉంగుటూరు ఆర్వో, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. జాతీయ రహదారి భీమడోలు రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెయింగ్ స్క్వాడ్ చెక్ పోస్టును ఆయన ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. రహదారిపై రాకపోకలు సాగించే కార్లు, ద్విచక్ర వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులు వాహనాలను తనిఖీ చేసే విధానాన్ని ఆయన పరిశీలించి వారికి తగిన సూచనలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, బహుమతులను రవాణా తదితర అంశాలపై అణువణువునా తనిఖీలు చేస్తున్నామన్నారు. వాహనదారులు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. డబ్బును తీసుకుని వెళ్లే తరుణంలో సంబంధిత పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. రూ.50 వేలకు మించి ఎక్కువ నగదు తరలించరాదని, తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో భీమడోలు సీఐ బీబీ రవి కుమార్, తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎస్సై వై.సుధాకర్, ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.